RNI: TELTEL12215
https://youtube.com/@PrabhathasuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## రాజ్యాంగ నైతికతను తిరస్కరించకూడదు



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు: రాజ్యాంగ నైతికత సిద్ధాంతాన్ని తిరస్కరిం చకూడదని భారత ప్రధాన న్యాయ మూర్తి డీవై చంద్రచూడ్ అన్నారు. కొన్ని సందర్భాల్లో ప్రస్తుత సామాజిక ఆచరణ పద్ధతుల కారణంగా రాజ్యాంగ నైతికత ఉద్రిక్తతకు లోనవుతోందన్న కారణంతో దానిని తిరస్కరించడం తగని పని అని చెప్పారు. రాజ్యాంగ నైతికత ద్వారా భారతీయ సాంస్కృతిక పద్ధతులను పరిశీలిం చేటప్పుడు వైరు ధ్యాలు తలెత్తే అవ కాశంపై అడిగిన ప్రశ్నకు ఆయన జవాబిస్తూ కొన్ని రాజ్యాంగ విలువలు ఆమోదయోగ్యమైనవని తెలిపారు. అంటరానితనం నిర్మూలన, ప్రభుత్వ విధాన ఆదేశిక సూత్రాలు వంటి అనేక రాజ్యాంగ నిబంధనలు మన దేశంలో అందరికీ ఒకటేనని చంద్రచూడ్ చెప్పారు.

RANGAREDDY, EDITION : 01, VOLUME :184 EDITOR: CHERUKU UPENDAR, DATE : MONDAY 19 NOVEMBER 2023 PAGES:4 RATE: Rs.5/-
రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 185 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : సోమవారం 20 నవంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

### గాజాలో స్కూలుపై దాడి

## 50 మంది మృతి

**పొంచివున్న ఆకలిచావులు : ఐరాస**



**గాజా సిటి- ప్రభాత సూర్యుడు:** గతకొద్ది రోజులుగా అల్‌షిఫా అస్పత్రిని లక్ష్యంగా చేసుకుంటూ దాడులు జరిపిన ఇజ్రాయిల్ బలగాలు తాజాగా జాబాలియా శరణార్థ శిబిరంలో గల స్కూలుపై దాడిచేశాయి. శనివారం ఉదయం అల్-ఫకూరా పాఠశాలపై జరిగిన దాడిలో 50మంది చనిపోయారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. మృతుల్లో 19మంది చిన్నారులతో సహా ఒకే కుటుంబానికిచెందిన 32మంది ఉన్నారు. స్కూలుపై బాంబు దాడిని హమస్ తీవ్రంగా ఖండించింది. అభం శుభం తెలియని చిన్నారులను, అమాయకులను బలితీసుకుంటున్న ఇజ్రాయిల్‌ను ఈ దాడులకు, నేరాలకు జవాబుదారీ చేస్తామని పేర్కొంది. మొత్తంగా ఉత్తర గాజా

మిగతా 2లో

## కాంగ్రెస్ కనుమరుగవుతుంది : మోడీ



**హైదరాబాద్- ప్రభాత సూర్యుడు:** రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీజేపీని గెలిపిస్తే అవినీతిపరుల జట్టును పారదోలతామని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. తారానగర్‌లో ఆదివారం జరిగిన ప్రచార ర్యాలీని ఉద్దేశించి మోడీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బ్యాట్స్‌మన్ ఒకరినొకరు రనౌట్ చేసుకునే క్రికెట్ టీం వంటిదని ఎద్దేవా చేశారు. సీఎం అశోక్ గెహ్లాట్ మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్ మధ్య సీఎం కుర్చీ కోసం జరుగుతున్న కలహాలను ప్రస్తావిస్తూ మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు. తాము అధికారంలోకి వస్తే రాజస్థాన్‌ను వేగంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. తమను గెలిపిస్తే అవినీతి జట్టును మట్టికరిపించి అభివృద్ధి దిశగా మెరుగైన స్కోర్ చేస్తామని రాజస్థాన్ విజయం సాధించేలా చేస్తామని చెప్పారు. రాజస్థాన్ యువత,

మిగతా 2లో

### చిన్నారులపై లైంగిక వేధింపులు..

## నిందితుడికి 707 ఏళ్ల జైలుశిక్ష



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** చిన్నారుల సంరక్షణ చూడాల్సిన ఓ వ్యక్తి వారిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దాదాపు 16 మంది అబ్బాయిలపై ఆ దుర్మార్గుడు వేధింపులకు పాల్పడటం గమనార్హం. ఈ కేసులో అతడికి తాజాగా 707 ఏళ్ల జైలు శిక్ష పడింది. దర్యాప్తులో నేరం చేసినట్లు తేలినప్పటికీ.. తన చర్యలను నిందితుడు సమర్థించుకోవడం గమనార్హం. కాలిఫోర్నియాకు చెందిన మాథ్యూ జాక్‌జేవ్‌స్కీ (34) స్థానికంగా చిన్నారుల సంరక్షణ బాధ్యతలు చూస్తుంటాడు. ఈ క్రమంలో తమ కుమారుడితో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు ఓ కుటుంబం గుర్తించింది. వారు వెంటనే పోలీసులకు

మిగతా 2లో

### ఫైనల్‌లో

# భారత్ ఓటమి

- భారత్ 240/10, ఆస్ట్రేలియా 241/4
- ఆసీస్ చేతిలో మళ్లీ భంగపాటు
- ఆరోసారి చాంపియన్‌గా ఆస్ట్రేలియా
- ఐసీసీ 2023 ప్రపంచకప్
- ప్రపంచకప్ ఫైనల్లో భారత్ ఓటమి
- ఛేదనలో ట్రావిశ్ హెడ్ మెరుపు సెంచరీ

మహబూబ్‌నగర్- ప్రభాత సూర్యుడు

కల చెదిరింది. కన్నీరే ఇక మిగిలింది. 2023 ప్రపంచకప్ టీమ్ ఇండియా చేజారింది. ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగిన ఫైనల్లో ఆస్ట్రేలియా 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. రికార్డు స్థాయిలో ఆరోసారి ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది. 2003 ప్రపంచకప్ ఫైనల్లో ఆసీస్ చేతిలో ఓడిన టీమ్ ఇండియా.. సొంతగడ్డపై 2023 ప్రపంచకప్ తుది పోరులోనూ నిరాశపరిచింది. ప్రపంచకప్‌లో ఫైనల్లో భారత్‌కు ఇది రెండో ఓటమి. అజేయ ప్రస్థానానికి ఊహించని ముగింపు. ఆతిథ్య జట్టుగా ప్రపంచకప్‌లో వరుసగా పది మ్యాచుల్లో ఎదురులేని విజయాలు సాధించిన టీమ్ ఇండియా.. టైటిల్ ముంగిట ఫైనల్లో బోల్తా పడింది.




'టాస్' పాత్ర గణనీయంగానే ఉన్నప్పటికీ బ్యాట్‌తో ఆతిథ్య జట్టు అంచనాలను అందుకోలేదు. సెమీఫైనల్ వరకు ప్రత్యర్థులను అన్ని విభాగాల్లో చిత్తు చేసిన టీమ్ ఇండియా.. టైటిల్ పోరులో మాత్రం ఆసీస్ చేతిలో అన్ని విభాగాల్లో తేలిపోయింది!.

మిగతా 2లో

### ఎఐ నిబంధనలపై జర్మనీ, ఫ్రాన్స్,

## ఇటలీల మధ్య ఒప్పందం




**బెర్లిన్ - విజయనేత్ర :** భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు (ఎఐ) ప్రవర్తనా నియమాల అంశంపై జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం యూరోపియన్ యూనియన్ స్థాయిలో చర్చలను వేగవంతం చేస్తుందని భావిస్తున్నాయి. ఈ ఒప్పందానికి సంబంధించిన పేపర్లను రాయిటర్స్ ఆదివారం విడుదల చేసింది. యూరోపియన్ యూనియన్‌లోని పెద్ద మరియు చిన్న ఎఐ ప్రొవైడర్‌ల కోసం మూడు ప్రభుత్వాలు పాటించవలసిన స్వచ్ఛంద కట్టుబాట్లను ఏర్పాటు చేసుకున్నాయి. యూరోపియన్ కమిషన్, యూరోపియన్ పార్లమెంట్ మరియు ఇయు కౌన్సిల్ ప్రస్తుతం ఈ కొత్త రంగంలో నిబంధనలు ఎలా ఉండాలనే దానిపై చర్చలు జరుపుతున్నాయి. ఎఐ అప్లికేషన్ భద్రత, వివక్షత ప్రమాదాలను నివారించే లక్ష్యంతో పాటు యూరోపియన్ యూనియన్‌లో ఈ కొత్త సాంకేతికత నెమ్మదించకుండా ఉండేలా పార్లమెంట్ జూన్‌లో 'ఎఐ యాక్ట్'ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. చర్చల సమయంలో యూరోపియన్ పార్లమెంట్ ప్రవర్తనా నియమావళి

# కాంగ్రెస్ వస్తే కరెంటు కాట్లు




- ఇందిరమ్మ రాజ్యంలో ఆకలి కేకలే
- నాడు నక్సల్స్ కాల్పులు.. ఎన్‌కౌంటర్లే
- ఎన్టీఆర్ 2కే కిలో బియ్యం ఇచ్చాకే బాధలు తీరాయి
- నా దీక్షతో తెలంగాణ ఇచ్చినట్లే ఇచ్చి వెనక్కుతగ్గింది
- సకల జనుల ఉద్యమం, బలిదానాలతో దిగొచ్చింది
- ఉద్యమించి తెచ్చిన తెలంగాణకు హాని తలపెట్టను
- ధరణి రద్దయితే రైతుబంధు రాదు
- బోయలను ఎస్టీల్లో చేర్చేందుకు ఢిల్లీలో పోరాటం
- ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్

మిగతా 2లో

## మహిళల కోసం ప్రత్యేక మ్యానిఫెస్టో : కేటీఆర్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రాష్ట్రంలో మరోసారి రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేననీ, వచ్చే ఐదేండ్లలో మహిళల కోసం ఏం చేస్తామనే అంశాలతో డిసెంబర్‌లో ప్రత్యేక మ్యానిఫెస్టో విడుదల చేస్తామని రాష్ట్ర మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. మహిళలు హైదరాబాద్‌ను సురక్షిత నగరంగా భావిస్తున్నారనీ, ఈ నగరాన్ని మరింత సురక్షితంగా మార్చేందుకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు చెప్పారు. హైదరాబాద్‌లో ఫ్యూచర్ ఫార్వర్డ్ తెలంగాణలో భాగంగా ఉమెన్ ఆస్క్ కేటీఆర్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ప్రతి ఇంటికి తాగునీరు ఇచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. మహిళల కోసం ప్రత్యేక నాలుగు ఇండిస్టియల్ పార్కులు తెచ్చామని గుర్తుచేశారు. తన జీవితంలో సానియా మీర్జా, సైనా వంటి ఎంతో మంది శక్తివంతులైన మహిళలను చూశానన్నారు. ఉమ్మడి కుటుంబాల్లో మహిళల పాత్ర కీలక మనీ, తాను ఉమ్మడి

మిగతా 3లో



## ఎఐ నిబంధనలపై జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీల మధ్య ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

మొదట ప్రధానంగా అమెరికా సహా అన్ని ఎఐ ప్రొవైడర్లు కట్టుబడి ఉండాలని ప్రతిపాదించింది. అయితే ఇవి యూరోపియన్ ప్రొవైడర్ల ప్రయోజనాలను దెబ్బతీస్తాయని ఈ మూడు దేశాలు హెచ్చరించాయి. ప్రవర్తనా నియమాలు, పాదర్శకతకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని పేర్కొన్నాయి. పేపర్ల ప్రకారం.. మొదట్లో ఎటువంటి ఆంక్షలు విధించ కూడదని భావించాయి. డిజిటల్ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో కలిసి ఈ చర్చలకు బాధ్యత వహిస్తున్న జర్మనీ ఆర్థిక మంత్రిత్వ శాఖ, చట్టాలు మరియు రాష్ట్ర నియంత్రణ ఎఐని నియంత్రించకూడదని , దాని అప్లికేషన్‌ను మాత్రమే నియంత్రించాలని పేర్కొంది.

## కాంగ్రెస్ కనుమరుగవుతుంది : మోడీ

(మొదటి పేజీ తరువాయి)

భవిష్యత్‌కు పాటుపడతామని భరోసా ఇచ్చారు. రాజస్థాన్ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ కనుమరుగవుతుందని మోడీ జోస్యం చెప్పారు. రాజస్థాన్‌లో ఐదేండ్ల కాంగ్రెస్ హయాంలో మహిళలు, దళితులపై నేరాలు పెచ్చుమీరాయని ఆందోళన వ్యక్తం చేశారు.

### చిన్నారులపై లైంగిక వేధింపులు..

## నిందితుడికి 707 ఏళ్ల జైలుశిక్ష

(మొదటి పేజీ తరువాయి)

ఫిర్యాదు చేయడంతో అసలు వాస్తవం బయటపడింది. ఇలా 2014 నుంచి 2019 మధ్యకాలంలో దాదాపు 16 మంది బాలురపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. బాధిత చిన్నారులంతా 2 నుంచి 14 ఏళ్ల వయసులోపు వారేనని పోలీసులు గుర్తించారు. ఇటీవల నిందితుడిని కోర్టు ముందు ప్రవేశపెట్టారు. చిన్నారులపై వేధింపులకు పాల్పడినప్పటికీ న్యాయస్థానం ముందు కూడా నిందితుడు నేరాన్ని అంగీకరించకపోగా.. తాను చేసింది కరక్టేనంటూ వాదించడం గమనార్హం. అతడి తీరుపై న్యాయస్థానం తీవ్రంగా వ్యాఖ్యానించింది. 'పిల్లల సంరక్షణ చూసే బాధ్యత ఇతడికి లేదు. ఇతడు ముసిముసి నవ్వులతో మారువేషంలో ఉన్న ఓ రాక్షసుడు' అంటూ ఆరెంజ్ కౌంటీ డిస్ట్రిక్ట్ అటార్నీ అని ఆరోపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. నిందితుడికి మొత్తంగా 707 ఏళ్లు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు .

## కాంగ్రెస్ వస్తే కరెంటు కాట్లు

(మొదటి పేజీ తరువాయి)

"ఇందిరమ్మ రాజ్యం తెస్తామంటూ కాంగ్రెస్ నాయకులు సిగ్గులేకుండా తిరుగుతున్నారు. ఇందిరమ్మ రాజ్యమా? తోకమట్టా? ఆనాడు ఎక్కడచూసినా ఆకలి కేకలే. నక్సలైట్ల కాల్పులు, ఎన్‌కౌంటర్ మరణాలు, మత కల్లోలాలు, రైతులు, చేనేత కార్మికు ల ఆత్మహత్యలే" అని బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ అన్నారు. ఎన్టీఆర్ వచ్చి రూ.2కు కిలో బియ్యం ఇచ్చేవరకు ప్రజల ఆకలి తీరలేదని.. అప్పటిదాకా సగం కడుపునకే అన్నం తినేవారని పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యమే బాగుంటే, రూ.2కు కిలో బియ్యం ఇవ్వాల్సిన అవసరం ఎందుకొచ్చేదని ప్రశ్నించారు. వాళ్లు సస్యశ్యామలం చేస్తే కరువెందుకుండేదని.. ఇందిరమ్మ రాజ్యంలో మన్ను తప్ప ఒరిగిందేమీ లేదని, అదోదరిద్రపు రాజ్యమని విమర్శించారు. ఆదివారం ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అలంపూర్, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తిల్లో తమ ఎమ్మెల్యే అభ్యర్థులు విజయు డు, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, గుర్క జైపాల్‌యాదవ్ తరఫున నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో కేసీఆర్ మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యం తెస్తామని రాహుల్ గాంధీ అంటున్నారని, 50 ఏళ్ల ఆ పార్టీ పాలనలో తెలంగాణ ఎట్లుండేదో, తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎలా మారిందో ప్రజలు గమనించాలని కోరారు. తాము రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని.. కాంగ్రెస్ రాజ్యంలో ఇవన్నీ ఉండేవా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ వస్తే రైతుబంధుకు రామ్‌రామ్, దళితబంధుకు జైభీమ్ చెబుతారని హెచ్చరించారు. ధరణిని రద్దు చేస్తామంటున్నారని, అప్పుడు రైతుబంధు రాదని, వీరి భూమి వారికి, వారి భూమి వీరికి రాసే వీఆర్వోలు, దళారులు మళ్లీ వస్తారన్నారు. ఉద్యమించి రాష్ట్రం సాధించానని, తెలంగాణ క్షేమం కోరేవాడినే తప్ప, హాని తలపెట్టనన్నారు. ఈ ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దని.. ఇవి ప్రజలకు జీవన్మరణ సమస్య.. బతుకుదెరువును నిర్ణయించే ఎన్నికలని పేర్కొన్నారు. "కాంగ్రెస్ హయాంలో తెలంగాణను వెనుకబడిన ప్రాంతంగా పిలిచేవారు. ఇక్కడి ప్రజలను యాచకుల్లా చూసేవారు. పేదలను పట్టించుకోలేదు. కనీసం మంచినీళ్లు ఇవ్వలేదు. కరెంటు లేదు. కరువుతో ప్రజ లు ముంబై, హైదరాబాద్‌కు వలస వెళ్లారు. తెలివి లేదని, నీళ్లు రావని, వరి పండించలేక జొన్నలు పండిస్తున్నారని అ నేవారు. గంజి కేంద్రాలు పెట్టి గంజిపోసేవారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పన్నులు చెల్లించిన డబ్బులను రైతుబంధు పేరుతో వృథా చేస్తున్నారని అంటున్నారు. రైతుబంధు వేస్ట్ పథకమా?" అని కేసీఆర్ ప్రశ్నించారు. ఇదే జిల్లాలో పుట్టిన పీసీసీ అధ్యక్షుడు రైతులకు 3 గంటల కరెంటు చాలని అంటున్నారని, అదెలాగంటే పది హెచ్‌పీ మోటార్లు వాడాలంటున్నారని, రైతులెవరైనా పది హెచ్‌పీ మోటార్లు వాడతారా? అని నిలదీశారు. బోయ వాల్మీకులను బీసీలలో చేర్చి అన్యాయం చేసింది కాంగ్రెస్సేనని, తాము అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే, మోదీ ప్రభుత్వం తొక్కిపెట్టిందని ఆరోపించారు.

**పాలమూరులో ప్రాజెక్టులే కట్టలేదు..**

కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ ప్రాజెక్టులను కాంగ్రెస్ పాలనలో 30 ఏళ్లు మూలన పడేశారని కేసీఆర్ దుయ్యబట్టారు. తెలంగాణ వచ్చాక మూడేళ్లలో వాటిని పూర్తిచేసి పాలమూరుకు నీళ్లిచ్చామని తెలిపారు. యాభై ఏళ్లపాటు తెలంగాణ అరిగోస పడిందని, కరువు, వలసలతో అల్లాడితే పట్టించుకున్న నాథుడే లేరని అన్నారు. తెలంగాణను ఏపీలో కలిపి ఇన్ని అవస్థలకు కారణమైందే కాంగ్రెస్ అని విమర్శించారు.

# ఫైనల్‌లో భారత్ ఓటమి

(మొదటి పేజీ తరువాయి)



ఆస్ట్రేలియా సిక్సర్. ఐసీసీ ప్రపంచకప్ టైటిల్ మరోసారి కంగారూ గూటికి చేరుకుంది. అలెన్ బోర్డర్, స్టీవ్ వా, రికీ పాంటింగ్, మైకల్ క్లార్క్ సరసన పాట్ కమిన్స్ నిలిచాడు. ఆస్ట్రేలియా ప్రపంచకప్ టైటిల్ అందించిన తొలి, ఓవరాల్‌గా మూడో బౌలర్, కెప్టెన్‌గా నిలిచాడు. గతంలో పేసర్లు కపిల్ దేవ్, ఇమ్రాన్ ఖాన్ మాత్రమే కెప్టెన్‌గా ప్రపంచకప్ ట్రోఫీని గెలుపొందారు. ఏడాది ఆరంభంలో ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో భారత్‌ను ఓడించిన ఆస్ట్రేలియా.. ఏడాది ఆఖర్లో ఐసీసీ ప్రపంచకప్ ఫైనల్లో టీమ్ ఇండియాకు తీరని వేదన మిగిల్చింది.

ఆతిథ్య భారత్ ఆశలు ఆవిరి. 2023 ప్రపంచకప్ విజేత ఆస్ట్రేలియా. ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగిన ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 241 పరుగుల లక్ష్యాన్ని అలవోకగా ఛేదించిన ఆస్ట్రేలియా రికార్డు ఆరో వరల్డ్‌కప్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఓపెనర్ ట్రావిశ్ హెడ్ (137, 120 బంతుల్లో 15 ఫోర్లు, 4 సిక్సులు) సెంచరీతో చెలరేగగా, మార్నస్ లబుషేన్ (58 నాటౌట్, 110 బంతుల్లో 4 ఫోర్లు) అజేయ అర్ధ సెంచరీతో సమయోచిత ఇన్నింగ్స్ నమోదు చేశాడు. హెడ్, లబుషేన్ నాల్గో వికెట్‌కు 192 పరుగుల భాగస్వామ్యం నిర్మించారు. 43 ఓవర్లలోనే ఆస్ట్రేలియాకు విజయాన్ని కట్టబెట్టారు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 240 పరుగులు చేసింది. కెఎల్ రాహుల్ (66, 107 బంతుల్లో 1 ఫోర్), విరాట్ కోహ్లి (54, 63 బంతుల్లో 4 ఫోర్లు), రోహిత్ శర్మ (47, 31 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులు) రాణించారు. ఛేదనలో మెరుపు సెంచరీతో విశ్వరూపం చూపించిన ట్రావిశ్ హెడ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

**ట్రావిశ్ హెడ్ అదుర్స్**

ఛేదనలో ఆసీస్‌కు ఆరంభంలోనే గట్టి షాక్ తగిలింది. డెవిడ్ వార్నర్ (7), మిచెల్ మార్ష్ (15), స్టీవ్ స్మిత్ (4)లు బుమ్రా, షమి దెబ్బకు పెవిలియన్‌కు చేరారు. 47/3తో ఆస్ట్రేలియా ఒత్తిడిలో పడింది. కానీ ఓపెనర్ ట్రావిశ్ హెడ్ మరో ఎండ్‌లో ధ్వంస రచన సాగించాడు. సహజ శైలికి విరుద్ధంగా పవర్‌ప్లేలో కాస్త నెమ్మదించిన హెడ్.. ఆ తర్వాత విరుచుకు పడ్డాడు. స్పిన్నర్లు జడేజా, కుల్దీప్‌లపై భారీ షాట్లు ఆడాడు. పరుగుల రాకతో ఆసీస్ శిబిరం తేలికపడింది. మార్నస్ లబుషేన్ మరో ఎండ్ నుంచి హెడ్‌కు చక్కటి సహకారం అందించాడు. స్ట్రయిక్ రొటేట్ చేస్తూ భారత బౌలర్ల ఉత్సాహాన్ని నీరుగార్చాడు. ఆరు ఫోర్లు, ఓ సిక్సర్‌తో హెడ్ అర్ధ సెంచరీ సాధించగా.. 14 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 95 బంతుల్లోనే శతకం అందుకున్నాడు. మార్నస్ లబుషేన్ మూడు ఫోర్ల అండతో 99 బంతుల్లో అర్ధ సెంచరీ చేశాడు. మిడిల్ ఓవర్లలో మంచు ప్రభావంతో భారత బౌలర్లు తేలిపోగా.. హెడ్, లబుషేన్ పరుగులు పిండుకున్నారు. ఈ జోడీని విడదీయటంలో విఫలమైన భారత్.. ప్రపంచకప్ టైటిల్ రేసు నుంచి నిష్క్రమించింది. ఆఖర్లో గ్లెన్ మాక్స్‌వెల్ (2 నాటౌట్) గెలుపు పరుగులతో ఆసీస్ శిబిరంలో సంబురాలకు తెరతీశాడు.

**మెరిసిన ఆ ముగ్గురు**

టాస్ నెగ్గిన ఆస్ట్రేలియా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఫైనల్లో ఆతిథ్య టీమ్ ఇండియా తొలుత బ్యాటింగ్‌కు వచ్చింది. కెప్టెన్ రోహిత్ శర్మ (47) తనదైన దూకుడుతో ఇన్నింగ్స్‌ను మొదలెట్టాడు. ఆసీస్ ఫీల్డర్లు బౌండరీలు నిలువరించినా.. రోహిత్ శర్మ దంచికొట్టాడు. నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో ఆసీస్ శిబిరంలో గుబులు పుట్టించాడు. ఓ ఎండ్‌లో గిల్ (4) తడబాటుకు గురైనా రోహిత్ మాత్రం అలవోకగా బౌండరీలు బాదాడు. ఆరంభంలోనే స్లిప్స్‌లో జీవనదానం పొందిన గిల్.. అవకాశం వృథా చేసుకున్నాడు. మిచెల్ స్టార్క్ వేసిన షార్ట్ బాల్‌కు సర్కిల్ లోపలే క్యాచౌట్‌గా నిష్క్రమించాడు. మాక్స్‌వెల్‌పై భారీ సిక్సర్‌తో అర్ధ సెంచరీ ముంగిట నిలిచిన రోహిత్ శర్మ.. అదే ఓవర్లో ట్రావిశ్ హెడ్ కండ్లుచెదిరే క్యాచ్‌తో పెవిలియన్‌కు చేరాడు. దీంతో పవర్‌ప్లేలోనే టీమ్ ఇండియా ఓపెనర్లు ఇద్దరినీ కోల్పోయింది. రోహిత్ శర్మ దూకుడుతో పవర్‌ప్లేలో టీమ్ ఇండియా దండిగా పరుగులు చేసింది. తొలి పది ఓవర్లలో భారత్ 80/2తో నిలిచింది.

స్లో పిచ్‌పై పవర్‌ప్లే తర్వాత భారత్‌కు పెద్దగా కలిసిరాలేదు. ఫామ్‌లో ఉన్న బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ (4) నిష్క్రమణతో టీమ్ ఇండియా శిబిరం ఒత్తిడిలో పడింది. ఈ సమయంలో విరాట్ కోహ్లి (54), కెఎల్ రాహుల్ (66) భారత్‌కు మంచి స్కోరు అందించారు. పరుగుల వేట కష్టమైన దశలో వికెట్ నిలుపుకుని ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. పవర్‌ప్లే అనంతరం ఏకంగా 97 బంతుల పాటు బౌండరీ రాకపోవటంతో స్కోరు బోర్డు పిచ్ కంటే ఎక్కువగా నెమ్మదించగా.. ఆసీస్ బౌలర్లలో ఉత్సాహం రెట్టింపు అయ్యింది. క్రీజులో కుదురుకున్న విరాట్ కోహ్లి నాలుగు బౌండరీలతో 56 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించాడు. కమిన్స్ ఓవర్లో బంతిని వికెట్లపైకి ఆడుకున్న కోహ్లి అనూహ్యంగా నిష్క్రమించి అభిమానుల్లో నైరాశ్యం నింపాడు. కోహ్లి నిష్క్రమణ తర్వాత రాహుల్ మరింత నెమ్మదించాడు. ఓ ఫోర్‌తో 86 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించినా.. మరో ఎండ్‌లో రవీంద్ర జడేజా (9) నిరాశపరిచాడు. సూర్యకుమార్ యాదవ్ (18)కు స్లో బౌన్సర్లతో పరీక్ష పెట్టిన ఆసీస్ ఆ దిశగా విజయవంతమైంది. టెయిలెండర్లలో కుల్దీప్ యాదవ్ (10), మహ్మద్ సిరాజ్ (9 నాటౌట్) ఆకట్టుకున్నారు. 50 ఓవర్లలో ఆలౌటైన భారత్ 240 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్ మూడు వికెట్లు పడగొట్టగా. జోశ్ హేజిల్‌వుడ్, పాట్ కమిన్స్ రెండేసి వికెట్లు తీశాడు. స్పిన్నర్లు గ్లెన్ మాక్స్‌వెల్, ఆడం జంపా పరుగుల పొదుపుతో చెరో వికెట్ ఖాతాలో వేసుకున్నారు.

**స్కోరు వివరాలు**

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (సి) హెడ్ (బి) మాక్స్‌వెల్ 47, శుభమన్ గిల్ (సి) జంపా (బి) స్టార్క్ 4, విరాట్ కోహ్లి (బి) కమిన్స్ 54, శ్రేయస్ అయ్యర్ (సి) ఇంగ్లిశ్ (బి) కమిన్స్ 4, కెఎల్ రాహుల్ (సి) ఇంగ్లిశ్ (బి) స్టార్క్ 66, రవీంద్ర జడేజా (సి) ఇంగ్లిశ్ (బి) హేజిల్‌వుడ్ 9, సూర్యకుమార్ యాదవ్ (సి) ఇంగ్లిశ్ (బి) హేజిల్‌వుడ్ 18, మహ్మద్ షమి (సి) ఇంగ్లిశ్ (బి) స్టార్క్ 6, జశ్‌ప్రీత్ బుమ్రా (ఎల్బీ) జంపా 1, కుల్దీప్ యాదవ్ రనౌట్ 10, మహ్మద్ సిరాజ్ నాటౌట్ 9, ఎక్స్‌ట్రాలు : 12, మొత్తం : (50 ఓవర్లలో ఆలౌట్) 240.

వికెట్ల పతనం : 1-30, 2-76, 3-81, 4-148, 5-178, 6-203, 7-211, 8-214, 9-226, 10-240.

బౌలింగ్ : మిచెల్ స్టార్క్ 10-0-55-3, జోశ్ హేజిల్‌వుడ్ 10-0-60-2, గ్లెన్ మాక్స్‌వెల్ 6-0-35-1, పాట్ కమిన్స్ 10-0-34-2, ఆడం జంపా 10-0-44-1, మిచెల్ మార్ష్ 2-0-5-0, ట్రావిశ్ హెడ్ 2-0-4-0.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ : డెవిడ్ వార్నర్ (సి) కోహ్లి (బి) షమి 7, ట్రావిశ్ హెడ్ (సి) గిల్ (బి) సిరాజ్ 137, మిచెల్ మార్ష్ (సి) రాహుల్ (బి) బుమ్రా 15, స్టీవ్ స్మిత్ (ఎల్బీ) బుమ్రా 4, మార్నస్ లబుషేన్ నాటౌట్ 58, గ్లెన్ మాక్స్‌వెల్ నాటౌట్ 2, ఎక్స్‌ట్రాలు : 18, మొత్తం : (43 ఓవర్లలో 4 వికెట్లకు) 241.

వికెట్ల పతనం : 1-16, 2-41, 3-47.

బౌలింగ్ : జశ్‌ప్రీత్ బుమ్రా 9-2-43-2, మహ్మద్ షమి 7-1-47-1, రవీంద్ర జడేజా 10-0-43-0, కుల్దీప్ యాదవ్ 10-0-56-0, మహ్మద్ సిరాజ్ 7-0-45-1.

**వరల్డ్ కప్ విజేత ఆస్ట్రేలియా..**

హైదరాబాద్ : భారత గడ్డపై జరిగిన వరల్డ్ కప్ ను పాట్ కమిన్స్ నాయకత్వంలోని ఆస్ట్రేలియా జట్టు ఎగరేసుకెళ్లింది. అలా ఇలా కాదు%ూ% టోర్నీలో తొలి రెండు మ్యాచ్ ల్లో ఓడిపోయి, ఆ తర్వాత వరుస విజయాలు సాధించి, ఆఫ్ఘన్ వంటి జట్టుపై అద్భుత రీతిలో పోరాడి, సెమీస్ లో దక్షిణాఫ్రికాను మట్టికరిపించి ఫైనల్ చేరిన ఆసీస్ జట్టు%ూ% ఫైనల్లో ఆతిథ్య టీమిండియాను ఓడించి సగర్వంగా వరల్డ్ కప్ ను ఒడిసిపట్టింది. ఇవాళ అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్ లో కంగారూలు ఆల్ రౌండ్ ప్రదర్శన కనబరిచి 6 వికెట్లతో తేడాతో ఘనవిజయం సాధించారు. తొలుత టీమిండియాను 240 పరుగులకు పరిమితం చేసిన ఆస్ట్రేలియన్లు%ూ% 241 పరుగుల లక్ష్యాన్ని 43 ఓవర్లలో 4 వికెట్లకు ఛేదించారు.

తద్వారా రికార్డు స్థాయిలో 6వ ప్రపంచకప్ టైటిల్ ను సాధించారు. ఆసీస్ విజయంలో బౌలర్లు, ఓపెనర్ ట్రావిస్ హెడ్ ప్రధాన పాత్ర పోషించారు. బౌలర్లు స్టార్క్, హేజెల్ వుడ్ కెప్టెన్ కమిన్స్ విశేషంగా రాణించి టీమిండియాను 240 పరుగులకు ఆలౌట్ చేయగా 241 పరుగుల లక్ష్యఛేదనలో ట్రావిస్ హెడ్ చిరస్మరణీయ సెంచరీతో అదరగొట్టాడు.

హెడ్ కు లబుషేన్ తోడవడంతో ఆ భాగస్వామ్యాన్ని విడగొట్టేం దుకు టీమిండియా విఫలయత్నాలు చేసింది. కానీ కొరకరానికొయ్యల్లా మారిన ఈ ఇద్దరు బ్యాటర్లు ఆతిథ్య జట్టుకు విజయాన్ని దూరం చేశారు. హెడ్ 137 పరుగులు చేయగా, లబుషేన్ 58 పరుగులతోనూ అజేయంగా నిలిచారు. హెడ్ 120 బంతులాడి 15 ఫోర్లు, 4 సిక్సులు కొట్టాడు. టీమిండియా బౌలర్లలో బుమ్రా 2, షమీ 1, సిరాజ్ 1 వికెట్ తీశారు. 2003 వరల్డ్ కప్ ఫైనల్లో ఎదురైన పరాభవానికి టీమిండియా నేడు ప్రతీకారం తీర్చుకుంటుందని అందరూ భావిస్తే ఆస్ట్రేలియా జట్టు తాను అంచనాలకు అందే జట్టును కాదంటూ వరల్డ్ కప్-2023 విజేతగా నిలిచింది.

# తెలంగాణలో అవినీతి పాలన: జేపీ నడ్డా

**చేవెళ్ల- ప్రభాత సూర్యుడు**

తెలంగాణలో అవినీతి పాలన రాజ్యమేలుతుందని బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా ఆరోపించారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలోని కేవీఆర్ గ్రౌండ్‌లో బీజేపీ సకలజనుల సంకల్ప సభ నిర్వహించింది. ఈ సమావేశానికి నడ్డా హాజరై మాట్లాడారు. ఈ తొమ్మిదేండ్లలో మోడీ ప్రభుత్వం తెలంగాణలో రూ.5 లక్షల కోట్ల నిధులు ఖర్చు పెట్టిందన్నారు. రాష్ట్రంలో బీజేపీ గెలిస్తే ఉజ్వల వినియోగదారులకు ఉచితంగా నాలుగు సిలిండర్లు ఇస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎంతమందికి రెండు పడక గదులు ఇచ్చిందో చెప్పాలన్నారు. తెలంగాణ చరిత్రలో తొలిసారి బీసీ వ్యక్తిని సీఎంగా చేస్తామని ప్రటించినట్టు తెలిపారు. తమను గెలిపిస్తే వరికి మద్దతు ధర కల్పిస్తామని, ఎరువుల కోసం




ఇన్‌ఫుట్ సబ్సిడీ ఇస్తామని చెప్పారు. మహిళా సంఘాలకు రూపాయి వడ్డీకే రుణాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికలు బీజేపీకి, కుటుంబ పార్టీలకు మధ్య జరుగుతున్నాయని, ఇతర రాష్ట్రాల్లో లాగానే తెలంగాణలో కూడా బీజేపీ కుటుంబ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతుందని అన్నారు. పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్‌ను కేంద్ర ప్రభుత్వం తగ్గిస్తే, కేసీఆర్ ఆ ప్రయోజనం ప్రజలకు అందకుండా చేశారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు సీఎం కేసీఆర్‌కు ఏటీఎంల మారిందని అన్నారు. మియాపూర్‌లో కోట్ల భూ కుంభకోణం జరిగిందని ఆరోపించారు. సర్కారు భూములను అమ్మి అవినీతికి పాల్పడ్డారని మండిపడ్డారు. దళిత బంధు ఇచ్చి ఎమ్మెల్యేలు మొత్తం 30శాతం కమీషన్ తీసుకున్నారన్నారు. ఈ 30శాతం కమీషన్ ప్రభుత్వాన్ని ఈ నెల 30న సాగనంపాలన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందన్నారు. అక్కడ ఏ పథకాలు అమలు కావడం లేదని తెలిపారు. అక్కడ ఇచ్చిన ఒక్క గ్యారంటీని అమలు చేయలేదని, ఇక్కడ కూడా ఆరు గ్యారెంటీలు ఇస్తామని ఆ పార్టీ చెబుతుందని, వాటిని నమ్మవద్దని తెలిపారు.

# మహిళల కోసం ప్రత్యేక మ్యానిఫెస్టో

(మొదటిపేజీ తరువాయి)

కుటుంబంలో పెరిగినట్లు చెప్పారు. మహిళల కోసం వడ్డీ లేని రుణాలు, ప్రత్యేక ఇండిస్ట్రియల్ పార్కులు, వి-హబ్‌తో పాటు మ్యానిఫెస్టోలో లేకున్నా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, అమ్మ ఒడి, కేసీఆర్ కిట్ వంటి పథకాలను ప్రత్యేకంగా మహిళల కోసం ప్రారంభించినట్లు కేటీఆర్ వివరించారు. ప్రత్యేక సౌకర్యాల కల్పనతో ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసూతీలు పెరిగాయనీ, మైనార్టీ బాలికలను విద్యలో ప్రోత్సహించేందుకు ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి చిన్నారిపై రూ.10 వేలకు పైగా ఖర్చు చేస్తున్నామన్నారు.

## పట్టుబడిన రూ.7.4 కోట్ల నగదు..10 మందికి నోటీసులు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

హైదరాబాద్ నగర శివారు అప్పా జంక్షన్ వద్ద పట్టుబడిన రూ.7.4 కోట్ల నగదు కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటికే ఈ కేసులో మొయినాబాద్ పోలీసులు 10 మందికి 41ఏ నోటీసులు జారీ చేశారు. ఇందులో ఖమ్మంకు చెందిన ఓ రాజకీయ పార్టీ నేత సమీప బంధువులు ఉన్నట్లు తెలుస్తోంది. అప్పా జంక్షన్ వద్ద పట్టుబడిన నగదును.. మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ పరిధిలో ఓ విద్యాసంస్థల ఛైర్మన్‌కు చెందిన ఫాంహౌస్‌లో నుంచి తరలించినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు ఫామ్‌హౌస్‌తో పాటు ఆయన ఇల్లు, కార్యాలయాల్లో ఐటీ అధికారులు సోదాలు చేశారు. పలు కీలక పత్రాలతో పాటు లాకర్ కీలను స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఓ ప్రధాన పార్టీ నేత కోసం ఈ నగదును తీసుకెళ్తున్నట్లు అనుమానిస్తున్నారు. ఇప్పటికే ఈ నగదును సీజ్ చేసిన మొయినాబాద్ పోలీసులు.. కోర్టులో సోమవారం డిపాజిట్ చేయనున్నారు.

## నేను రష్మిక అంత ఫేమస్ కాదు : కెటిఆర్




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: " ప్రత్యర్థులు డీప్‌ఫేక్ వాడి తమపై దుష్ప్రచారం చేస్తున్నారని... నేను రష్మిక అంత ఫేమస్ కాదు " అని మంత్రి కెటిఆర్ అన్నారు. గ్రాండ్ కాకతీయ హౌటల్‌లో పేరుతో మహిళలతో నిర్వహించిన ప్రత్యేక చర్చా కార్యక్రమంలో మంత్రి కెటిఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ ... తమ తల్లిని చూసి చాలా నేర్చుకున్నామన్నారు. తాము మళ్లీ అధికారంలోకి వస్తే మహిళలకు చాలా తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తామన్నారు. డీప్‌ఫేక్ మహిళలకు మాత్రమే కాకుండా రాజకీయ నేతలకు సైతం ప్రమాదమేనని చెప్పారు. ప్రత్యర్థులు డీప్‌ఫేక్ వాడి తమపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తాను రష్మిక అంత ఫేమస్ కాదని సరదాగా వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో మహిళలకు సరైన సంఖ్యలో టికెట్లు ఇవ్వలేదని.. దీనిపై బాధగా ఉందన్నారు. ఈ సంఖ్య పెరిగేలా చూస్తామని కెటిఆర్ చెప్పారు.

## 110 స్థానాల్లో బీజేపీకి డిపాజిట్ గల్లంతు

-'మీట్ ది ప్రెస్'లో రేవంత్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: ఎన్నికల్లో బీజేపీకి 110 సీట్లలో డిపాజిట్లు రావు. రాష్ట్రానికి బీసీ సీఎంను ఎలా చేస్తుందని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. 10 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉంటే.. ఒకరు మాత్రమే ఓబీసీ సీఎం ఉన్నారని గుర్తు చేశారు. బీసీ గణన చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్నా%ూ%ఆ పార్టీ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ జర్నలిస్టుల అధ్యయన వేదిక ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో రేవంత్ మాట్లాడారు. బీసీగణన చేయలేని పార్టీ బీసీ సీఎంను ఎలా చేస్తుందని నిలదీశారు. బలహీనవర్గాలు కేసీఆర్‌ను ఓడించాలన్న కసితో ఉన్నాయన్నారు.

ఆ ఓట్లను చీల్చి కేసీఆర్‌కు సహకరించడమే బీజేపీ వ్యూహమని విమర్శించారు. ఎన్నికల కోసమే బీజేపీ ఎస్సీ వర్గీకరణ హామీ ఇస్తుందని చెప్పారు.ఎస్సీ వర్గీకరణపై గతంలో వెంకయ్య నాయుడు సభ నిర్వహించి 100 రోజుల్లో చేస్తామన్నారు. ఇప్పటికీ అతీగతీ లేదన్నారు. బిల్లు పెడితే మద్దతు ఇస్తామని కాంగ్రెస్ చెబుతున్నా బీజేపీ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. దళితుల ఓట్లు కాంగ్రెస్‌కు రాకుండా చీల్చేందుకే కమిటీతో కాలయాపన అని ఆరోపించారు.

# అధికారమిస్తే అభివృద్ధి చూపిస్తాం

## ఖానాపూర్, ఆసిఫాబాద్ సభల్లో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకగాంధీ

ఆదిలాబాద్ - ప్రభాత సూర్యుడు : పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణను ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తిగా దోచుకున్నారని కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకగాంధీ ఆరోపించారు. తెలంగాణ ఇచ్చిన లక్ష్యం.. ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. పెద్ద కంపెనీలతో దోస్తానీ చేస్తూ బీజేపీ దేశాన్ని నాశనం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేంద్రంలో బీజేపీ నేతలు పెద్దలకు రుణమాఫీ చేస్తారు తప్ప రైతులు, కార్మికులకు రుణాలు మాఫీ చేయబోరని అన్నారు. దేశంలో మోడీ, రాష్ట్రంలో కేసీఆర్ ప్రజల రక్తం తాగుతున్నారని ఘాటుగా విమర్శించారు. ఒక్కసారి కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగించాలని.. అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చేసి చూపిస్తామని అన్నారు. అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని భరోసా ఇచ్చారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్, కుమురంభీం ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభల్లో ప్రియాంక గాంధీ పాల్గొని మాట్లాడారు. ఖానాపూర్, నిర్మల్, ఆసిఫాబాద్, సిర్పూర్ కాంగ్రెస్ అభ్యర్థులు వెడ్మ బొజ్జు, శ్రీహరిరావు, శ్యాంనాయక్, రావి శ్రీనివాస్‌లను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఇందిరాగాంధీ చేసిన మంచి పనులే ఇప్పటికీ ప్రజల మదిలో ఉండేలా చేశాయని గుర్తుచేశారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతను కాంగ్రెస్ పార్టీ అంతే బాధ్యతతో నిర్వర్తించిందన్నారు. ఆదివాసీ, గిరిజనుల సంక్షేమానికి ఇందిరాగాంధీ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని చెప్పారు. ఆమె మరణించి 40 ఏండ్లు అయినా ఇంకా ఆరాధించడం పట్ల సంతోషం వెలిబుచ్చారు. జంగ్, జంగల్, జమీన్ సంస్కృతి ఆదివాసీ సంస్కృతి అని, ఇది ప్రపంచంలో అత్యున్నతమైన సంస్కృతి అని తెలిపారు. ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులు చూసి ఆనాడు కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని.. కానీ ఏ ఉద్దేశంతో ఇచ్చిందో ఆ లక్ష్యం నెరవేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుద్యోగుల సమస్యలు తీరలేదని..



కేవలం కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని.. మీరు మాత్రం కేసీఆర్, కేటీఆర్‌లకు ఉద్యోగాలు ఇవ్వకూడదని సూచించారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల పేరుతో తొమ్మిదేండ్లుగా ప్రజలను మోసం చేశారన్నారు. ప్రధాని మోడీ రాష్ట్రానికి వచ్చి కాళేశ్వరంలో జరిగిన అవినీతిపై మాట్లాడలేదని.. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం ఒక్కటేనని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వంలో నిరుద్యోగుల ఆత్మహత్యలు పెరిగాయని, ధరణి పోర్టల్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేననే విషయాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పారు. కచ్చితంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. ఉద్యమకారుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని, రూ.10లక్షల ఇన్సూరెన్సుతో యువవికాసం పథకాన్ని తీసుకొస్తామన్నారు. ప్రతి జిల్లాలో ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణం చేపడతామని, కర్నాటక తరహాలో మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు, రూ.500లకే గ్యాస్ సిలిండర్, అభయహస్తం కింద రూ.12లక్షలు చెల్లిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌ను ఆదరించి అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇన్‌ఛార్జి మాణిక్‌రావు ఠాక్రే, మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌చవాన్, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి, కర్నాటక ఎమ్మెల్సీ ప్రకాష్‌రాథోడ్, రాజురా ఎమ్మెల్యే సుభాష్‌దోబే, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు విశ్వప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ఓటుతో ప్రజాస్వామ్యాన్ని గెలిపించండి

## ధనస్వామ్యాన్ని తిరస్కరించండి: రాఘవులు, మధు, తమ్మినేని

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

సీపీఐ(ఎం) అభ్యర్థుల ఎన్నికల ప్రచార జోరు హుషారుగా సాగుతోంది. లింగ, వయో భేదం లేకుండా ప్రజలు వారికి బ్రహ్మరథం పడుతున్నారు. ఇన్నాళ్లు మాకోసం మీరు కొట్లాడారు%ూ%ఇప్పుడు మీకు తోడుగా మేం ఉంటాం అంటూ ఓటర్లే కార్యకర్తలుగా మారి ప్రచారం చేస్తున్నారు. ఎర్రజెండా ఒంటరిపోరును మనస్ఫూర్తిగా స్వాగతిస్తూ, మద్దతిస్తున్నారు. సీపీఐ(ఎం) పోలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, మాజీ ఎంపీ, సీపీఐ(ఎం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రశాఖ మాజీ కార్యదర్శి పీ మధు, తెలంగాణ శాఖ కార్యదర్శి, పాలేరు నియోజకవర్గ అభ్యర్థి తమ్మినేని వీరభద్రం సహా పార్టీ శ్రేణులంతా సత్తా చాటేందుకు చమటోడుస్తున్నారు. ఆదివారం వివిధ ప్రాంతాల్లో జరిగిన సభల్లో పాల్గొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల బూర్జువా విధానాలను ఎక్కడికక్కడ ఎండగడుతూ వన్నీ ఒకే తానులో ముక్కలని ప్రజలకు అర్థం అయ్యేలా చెప్తున్నారు. విధానాల మార్పు లేకుండా సమసమాజ స్థాపన సాధ్యం కాదనే



వాస్తవాలను వివరించి చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు ఆసక్తిగా నిజానిజాలను నిర్ధారించుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఎర్రజెండాలతో కదులుతున్న ఎర్రదండుకు ఘనస్వాగతం పలుకుతున్నారు.

# బీజేపీ మ్యానిఫెస్టో ఎన్నికల జిమ్మిక్కు..

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:

రాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా విడుదల చేసిన బీజేపీ మ్యానిఫెస్టో ఎన్నికల జిమ్మిక్కుగా ఉందని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటి విమర్శించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణ రాష్ట్రాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఇవ్వలేదని పేర్కొన్నారు. విభజన చట్టాన్ని అమలు చేయలేదని తెలిపారు. తీవ్ర ఆర్థిక దిగ్బంధానికి గురి చేసిందని పేర్కొన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అమిత్‌షా శనివారం ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోలోని అంశాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు కావడం లేదని గుర్తుచేశారు. తెలంగాణలో అమలు చేస్తామని ప్రకటించడం ప్రజలను మోసగించడమేనని తెలిపారు. ఈ మ్యానిఫెస్టో ప్రజల్లో చీలిక తేవడంతో పాటు, సంక్షేమ పథకాలకు కోతకోసేదిగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు దీన్ని గమనించి ఈ ఎన్నికల్లో మతోన్మాద, ప్రజా వ్యతిరేక బీజేపీనీ, దాని మిత్రపక్షాలను ఓడించి తగిన బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. 2014లో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కేంద్ర బీజేపీ ప్రకటించి, వాటికి ఎగనామం పెట్టిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న లక్షలాది ఖాళీలు నింపకుండా, ఇక్కడ ఉద్యోగాల భర్తీ చేస్తామంటే ఎలా నమ్మాలని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలో ఉండి ద్రవ్యోల్బణాన్ని అరికట్టే అవకాశం ఉన్నప్పటికీ అరికట్టలేని బీజేపీ, రాష్ట్రంలో ఎలా అరికడుతుందని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన కృష్ణా జాలాలను పంపిణీ చేయకుండా ప్రాజెక్టులను ఆపిందని తెలిపారు. వ్యవసాయ రంగాన్నీ, వ్యవసాయ మార్కెట్లను కార్పోరేటీకరించాలని నాలుగు నల్లచట్టాలను తెచ్చిందని పేర్కొన్నారు. 23 వ్యవసాయ ఉత్పత్తులకు మాత్రమే అశాస్త్రీయ మద్దతు ధర నిర్ణయించి కార్పొరేట్ వ్యాపారులకు లక్షల కోట్ల లాభాలు ఆర్జించి పెడుతున్నదన్నారు. కానీ నేడు తెలంగాణలో వ్యవసాయానికి ఎరువులు, సబ్సిడీలు, ధాన్యానికి మద్దతు ధరలు అమలుచేస్తామని ప్రకటించడం హాస్యాస్పదని తెలిపారు. ఎఫ్‌సీఐ ద్వారా దాన్య సేకరణ చేయకుండా తెలంగాణ రైతాంగాన్ని ముంచి, ఇప్పుడు




రాష్ట్రంలో క్వింటాల్‌కు రూ.3,100 ఇస్తామని చెబుతున్నదని తెలిపారు.

కేంద్రంలో పదేండ్ల నుంచి అధికారంలో ఉన్న బీజేపీ రూ.3,100లు మద్దతు ధరను ఎందుకు నిర్ణయించలేదు?అని ప్రశ్నించారు. గత ఎన్నికల సందర్భంగా ప్రకటించిన పసుపుబోర్డు ప్రకటన శిలాఫలకాలకే పరిమితమైందని గుర్తుచేశారు. దాన్ని టర్మరిక్ సిటీ చేస్తామంటే ప్రజలు నమ్మే స్థితిలో లేరని పేర్కొన్నారు. పార్లమెంటులో చిన్న సవరణ చేస్తే అమల్లోకి వచ్చే ఎస్సీ వర్గీకరణకు, ఇప్పుడు మళ్లీ కమిటీ వేస్తామనడం ఎన్నికల జిమ్మిక్కేనని విమర్శించారు.

## మానవత్వాన్ని చాటుకున్న యుటిఎఫ్ మండల కమిటీ

**- యుటిఎఫ్ మండల కమిటీ అధ్యక్షులు నరసింహ**



**యాచారం - ప్రభాత సూర్యుడు:** యాచారం మండలం ఉపాధ్యాయులు, గున్ గల్ ప్రాథమిక పాఠశాల అనురాధ భర్త బాల మల్లేష్ ఆకస్మిక మరణం పట్ల విస్మయం చెందిన యాచారం యుటిఎఫ్ మండల కమిటీ అధ్యక్షులు నర్సింహా ఆధ్వర్యంలో తమవంతుగా 30 వేల ఆర్థిక సహాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జంగయ్య చావ రవి గార్లు గాలయ్య వెంకటప్ప జగన్నాథ్, కిషన్,వెంకటేష్ మోతిలాల్ జంగయ్య, రమేష్ కృష్ణవేణి, అలివేలు తదితరులు పాల్గొని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపం తెలియజేశారు.

## బిఆర్ఎస్‌లో చేరిన బాబూమోహన్ కుమారుడు



**సంగారెడ్డి (హైదరాబాద్) -ప్రభాతసూర్యుడు**

బిజెపి అందోల్ అభ్యర్థి బాబూ మోహన్ కుమారుడు ఉదయ్ బాబూ మోహన్ బిఆర్ఎస్‌లో చేరారు. సిద్ధిపేటలో మంత్రి హరీష్ రావు సమక్షంలో ఉదయ్ బాబూ మోహన్ బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఉదరు బాబూ మోహన్ అందోల్ బిజెపి టికెట్ ఆశించారు. అయితే టికెట్ దక్కకపోవడంతో ఆయన బిఆర్ఎస్‌లో చేరారు. ఉదయ్ బాబు మోహన్‌తో పాటు, ఆందోల్, జోగిపేట మున్సిపల్ ప్రెసిడెంట్ సాయి కృష్ణ, అందోల్ మండల ప్రెసిడెంట్ నవీన్ ముదిరాజ్, చౌటకుర్ మండల ప్రెసిడెంట్ శేఖర్, ఇతర బిజెపి నాయకులు పార్టీలో చేరారు. తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన సిఎం కెసిఆర్ వైపు నిలబడాలని, పార్టీ గెలుపు కోసం అందరం కలిసి కృషి చేయాలని మంత్రి హరీష్‌రావు పిలుపునిచ్చారు.

## ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థి ఆత్మహత్య

**నిజామాబాద్ -ప్రభాతసూర్యుడు**



తెలంగాణ ఎన్నికల బరిలో నిలిచిన యమగంటి కన్నయ్య గౌడ్ (36) అనే అభ్యర్థి ఆత్మహత్యకు పాల్ప డ్డారు. ఈ ఘటన నిజామాబాద్‌లో చోటుచేసుకుంది. నగరంలోని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. సాయినగర్‌లో నివాస ముంటు న్న కన్నయ్య ఆదివారం వేకువజామున ఇంట్లోనే ఉరేసుకున్నారు. గమ నించిన కుటుంబసభ్యులు వెంటనే ఆయన్ను నిజామాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయన ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## మంగళూరు ఎయిర్ పోర్ట్‌లో పట్టుబడ్డ రూ.70.02 లక్షల విలువైన బంగారం

**హైదరాబాద్ -ప్రభాతసూర్యుడు**

మంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో గత 10 రోజుల్లో 1,179 గ్రాముల బంగారాన్ని మంగళూరు కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మొత్తం బంగారం విలువ రూ.70,02,568.. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, మంగళూరు కస్టమ్స్ అధికారుల ప్రొఫైలింగ్ ఆధారంగా, నవంబర్ 9 నుండి 13 మధ్య ఇండిగో ఫ్లైట్ 6ఈ1163 ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఫ్లైట్ IX814 ద్వారా దుబాయ్ నుండి మంగళూరుకు వెళ్తున్న ఇద్దరు ప్రయాణికులను అడ్డుకున్నారు. వారి లగేజీని స్కానింగ్ చేసి, ఓపెన్ చేసి పరిశీలించగా, ట్రాలీ బ్యాగ్‌లో బీడింగ్ రాడ్‌ల రూపంలో 21.6/24 క్యారెట్ బంగారం, రిస్ట్ వాచ్, బాల్ పాయింట్ పెన్, హెయిర్ ట్రిమ్మర్, స్టెయిన్‌లెస్ స్టీల్ ఉన్ని స్కార్ఫ్‌లో దాచిన రోడియం కోటెడ్ బంగారు వస్తువులు కనుగొనబడ్డాయి. ఒక రోడియం పూతతో కూడిన నాణెం. పట్టుబడిన మొత్తం బంగారం విలువ రూ.18,17,718.. నవంబర్ 18న, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం IX 814 ద్వారా దుబాయ్ నుండి మంగళూరుకు వచ్చిన ఒక ప్రయాణికుడి నుండి అధికారులు 857 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరణాత్మక పరిశీలనలో, రెండు కార్ స్పీకర్లలో దాచిన రెండు వృత్తాకార ముక్కలు, ఎయిర్‌పాడ్‌లో రెండు దీర్ఘచతురస్రాకార కట్ ముక్కలు, పవర్ అడాప్టర్‌లో ఒక దీర్ఘచతురస్రాకార ముక్క, 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన బంగారం కనుగొనబడింది.. ఈ ఘటన గురించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నాయి..

# మంచినీరు ఇచ్చి మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడిన ఘనత కేసీఆర్ దే

**- బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్ రెడ్డి**
**-బిఆర్ఎస్ పార్టీలో చేరిన సిపిఎం నాయకులు**
**-మరోసారి బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం**



**ఇబ్రహీం పట్నం - ప్రభాతసూర్యుడు:** ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బిఆర్ ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్ రెడ్డి. ఇబ్రహీంపట్నం మండలంలోని జాజోన్ బాయి, మాన్యగూడ, పోల్కంపల్లి, ఎన్ గల్ గూడ, నాగన్ పల్లి, రాయపోలు,నెర్రపల్లి, దండు మైలారం తదితర గ్రామాలలో రోడ్ షో నిర్వహించి, ఆయా గ్రామాల చౌరస్తాలలో ప్రసంగించిన మంచిరెడ్డి కిషన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణా రెడ్డి. మంచాల మండల కేంద్రానికి చెందిన సిపిఎం పార్టీ నాయకులు భారత రాష్ట్ర సమితి పార్టీలో ఆదివారం చేరారు.

ఎన్ గల్ గూడ, నాగన్ పల్లి గ్రామాల నుండి కాంగ్రెస్, వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్ చేసిన అభివృద్ధికి ఆకర్షితులై మరోసారి కారు పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ లో చేరారు. వారికి మంచిరెడ్డి గులాబీల కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఊర్లని అభివృద్ధి చేసిన వారికి ఓటేస్తారా అసలు ఊర్ల పేర్లు తెల్వని వారికి ఓటేస్తరా ప్రజలే ఆలోచించుకోవాలని ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం మండలాన్ని అభివృద్ధి చేశాను మరో సారి ఆశీర్వదించమని, పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మార్చినుండి 400లకే గ్యాస్ సిలిం డర్, రేషన్ కార్డు ఉన్న ప్రతీ నిరుపేద కుంటుంబాలకు సన్నబియ్యం పంపిణి, ఆసరా పెంచన్ 2016 నుండి 5వేలకు పెంపు,3016నుండి 6వేలకు పెంపు, ఇల్లు లేని ప్రతీ నిరుపేద కుంటుంబానికి 120గజాల స్థలం డబుల్ బెడ్ రూం, ప్రతీ నిరుపేద కుంటుంబానికి ఐదులాక్షల బీమా పథకం, వరలక్ష్మి పథకం కింద మహిళలకు 3వేలు పంపిణి కేసీఆర్ ప్రభుత్వం చేస్తుందని ఇంకా ఎన్నో అద్భుతమైన పథకలను ముఖ్యమంత్రి కేసీఆర్ మేనిపెస్టోలో పెట్టారని అన్నారు. అభివృద్ధిని వివిధ పార్టీల నుండి బిఆర్ఎస్‌లో చేరుతున్నారని, కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని గెలపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృపేష్, పోల్కంపల్లి సర్పంచ్ చెరుకూరి అండాలు గిరి, ఎంపీటీసీ చెరుకూరి మంగా రవీందర్, నందికొండ రవీందర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు గుండ్ల దానయ్య, దేరంగుల నరసింహ్మా, గునుకుల మల్లేష్, దొండ వినోద్ రెడ్డి, వల్లపు రాజు, పిఎసిఎస్ చైర్మన్ రాజశేఖర్ రెడ్డి, రాయపోల్ సర్పంచ్ గంగిరెడ్డి బలవంత్ రెడ్డి, ఎంపీటీసీ గంగిరెడ్డి జ్యోతి భాస్కర్ రెడ్డి, దండు మైలారం సర్పంచ్ రమణమోని మల్లీశ్వరి జంగయ్య ఆయా గ్రామాల యువజన నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని ఎన్నికల ప్రచారాన్ని విజయవంతం చేశారు.

# యాదాద్రి తరహాలో భద్రాద్రి అభివృద్ధి

**- గెలిపిస్తే రామయ్య దర్శనం చేసుకుంటా..**
**- కాంగ్రెస్ చేతికి కత్తి ఇచ్చి యుద్ధం మమ్మల్ని చేయమంటే ఎలా..?**
**- గిరిజనేతరులకు పోడు పట్టాలివ్వాలనుకున్నా మోడీ అడ్డంకి కేసీఆర్‌తోనే సింగరేణికి పరిరక్షణ**
**- కొత్తగూడెం, భద్రాచలంలో కేటీఆర్ రోడ్ షో**



**భద్రాచలం రూరల్/ కొత్తగూడెం- ప్రభాతసూర్యుడు:** భద్రాద్రి రామయ్యను కేసీఆర్ నిర్లక్ష్యం చేస్తున్నారనడం లో వాస్తవం లేదని, రాముడుపై అపారమైన భక్తి ఉంది కనుకనే నా పేరు తారకరాముడిగా పెట్టారని, ఈ ఎన్నికల్లో తెల్లం వెంకట్రావుని గెలిపిస్తే రామయ్యను దర్శనం చేసుకుంటానని మంత్రి కేటీఆర్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం, కొత్తగూడెం పట్టణాల్లో కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీలపై తనదైన శైలిలో విమర్శలు కురిపించారు. కాంగ్రెస్ చేతికి కత్తి ఇచ్చి మమ్మల్ని యుద్ధం చేయమంటే ఎలా, 60 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఈ ప్రాంతానికి ఏం చేసిందని ప్రశ్నించారు. బీజేపీ దివాళా కోరు విధానాలతో దేశం వెనకబడి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో భద్రాచలంలో తెల్లం వెంకట్రావుని గెలిపిస్తే భద్రాద్రిని యాదాద్రి తరహాలో అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. భద్రాచలానికి కాంగ్రెస్ పార్టీ వల్లే పోలవరం శాపంగా మారిందన్నారు. గిరిజనేతరులకు కూడా పోడు పట్టాలు ఇచ్చేందుకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం అడ్డుపడుతుందని ఆరోపించారు.

కొత్తగూడెం పట్టణంలోని సూపర్ బజార్ సెంటర్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం సింగరేణి సంస్థను పంటికి అంటకుండా మింగేసేందుకు కుట్రలు చేస్తుందన్నారు. ఈ కుట్రలు అడ్డుకునేందుకు కాంగ్రెస్ ఏమాత్రం ప్రయత్నం చేయట్లేదని, సింగరేణి పరిరక్షణ కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ తెలంగాణకు గుండెకాయని, కార్మికులు, సంస్థను రక్షించుకునే బాధ్యత మాదేనన్నారు. సింగరేణిని లాభాల బాటలోకి తీసుకువచ్చింది కేసీఆర్ ప్రభుత్వం అని తెలిపారు. ఓట్లు కొనేందుకు వస్తున్న బడాబాబులకు కొత్తగూడెం ప్రజల చైతన్యాన్ని రుచి చూపించాలని సూచించారు. సింగరేణి బతకాలంటే కేసీఆర్, వనమాకు ఓటు వేయాలని కార్మికులను కోరారు. కార్యక్రమాల్లో ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవి చంద్ర, ఎమ్మెల్సీ తాత మధు, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, భద్రాచలం, కొత్తగూడెం ఎమ్మెల్యే అభ్యర్థులు తెల్లం వెంకటరావు, వనమా వెంకటేశ్వరావు, రాష్ట్ర నాయకులు ఎడవల్లి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**దర్శనం చేసుకోకపోవడంపై చర్చ**

భద్రాచలం ప్రజల ఓట్లను అడిగేందుకు ఎన్నికల ప్రచార నిమిత్తం భద్రాచలానికి వచ్చిన కేటీఆర్ భద్రాద్రి రామయ్యను దర్శించుకోకపోవడమేంటనే ప్రశ్న స్థానికంగా వ్యక్తమైంది. భద్రాచలంలో బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తేనే రామయ్య దర్శనానికి వస్తానని మాట్లాడటం సరికాదని విశ్లేషకుల అభిప్రాయం. గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన రూ.100 కోట్లు, రూ.1000 కోట్ల హామీపై నోరు మెదపలేదు. కనీసం భద్రాచలం అభివృద్ధికి నిర్దిష్టమైన ప్రణాళిక కూడా ప్రకటించలేదు. దీనిపై విమర్శలు ఉన్న నేపథ్యంలోనే కేటీఆర్ వ్యవహారశైలి మరోసారి చర్చకు దారితీసింది.

# బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం లోపాయికారీ పొత్తు

**- మైనార్టీలు ఆలోచించి ఓటు వేయండి : సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ**




**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు:** బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు లోపాయికారీ ఒప్పందంతో ఎన్నికల బరిలోకి దిగి ప్రజలను మోసం చేస్తున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. ఆదివారం మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషాతో కలిసి హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ గోషామహల్ అభ్యర్థి రాజాసింగ్‌పై పోటీ పెట్టకుండా, జూబ్లీహిల్స్ కాంగ్రెస్ మైనార్టీ అభ్యర్థిపైన ఎంఐఎం బరిలో దిగడం మూడు పార్టీల మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందం స్పష్టమవుతుందని విమర్శించారు. పదేండ్లుగా అధికారంలో కొనసాగుతున్న బీజేపీ బీఆర్ఎస్‌లకు గ్యాస్ ధరలు ఎందుకు గుర్తుకు రాలేదని నిలదీశారు.. యువతను, విద్యార్థులను మోసం చేసేందుకు తప్పుడు మ్యానిఫెస్టోలను ప్రకటించారని విమర్శించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఒక్క ప్రభుత్వ రంగ సంస్థను ఏర్పాటు చేయక పోగా, ఉన్న సంస్థలను విక్రయించి, నిరుద్యోగులకు ఉద్యోగాలు లేకుండా చేసిందని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పోటీ పరీక్షలను కూడా సక్రమంగా నిర్వహించలేక పోయిందని దుయ్యబట్టారు. శాసనసభ ఎన్నికల్లో డిపాజిట్లను కూడా తెచ్చుకోలేని బీజేపీ బీసీని ఎలా ముఖ్యమంత్రి చేస్తుందని ప్రశ్నించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన బండి సంజయ్‌ని పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పించిందని గుర్తు చేశారు. లిక్కర్ కేసులో కవితను కాపాడేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పోటీ చేస్తున్న కొత్తగూడెం శాసనసభ నియోజకర్గంలో ఒక ఇండిపెండెంట్ వ్యక్తికి వామపక్ష పార్టీగా చెప్పుకునే ఫ్వార్వర్డ్ బ్లాక్ బీ ఫామ్ ఎలా ఇస్తుందని నారాయణ ప్రశ్నించారు. సీపీఐ మాజీ ఎంపీ అజీజ్ పాషా మాట్లాడుతూ యూపీ, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తున్న ఎంఐఎం, తెలంగాణ సొంత రాష్ట్రంలో కేవలం 9 సీట్లలోనే ఎందుకు పోటీ చేస్తుందని నిలదీశారు.. రాష్ట్ర వ్యాప్తంగా 40 శాసనసభ నియోజకర్గాల్లో ముస్లింల ప్రభావం ఉంటుందని, ఈసారి ఎంఐఎం తీరుపై ఆలోచించి ఓటు వేయాలని వారికి సూచించారు. తెలంగాణలో కర్నాటక తరహా మార్పులు వస్తాయని అజీజ్ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్, నర్సింహ పాల్గొన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215